సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
శుక్రవారం, 05.06.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 214
పేజీలు: 06 వెల: రూ. 5


# మేఘం కురిసెను

06 వేసవి వేడి నుంచి ఉపశమనం

- కేరళను తాకిన నైరుతి.. గత రాత్రి నుంచి కేరళం, తమిళనాడులో వానలు
- నేటి నుంచి తెలంగాణలో తొలకరి జల్లులు..
- వరుసగా మూడు రోజుల పాటు వానలుంటాయి
- ఆంధ్రప్రదేశ్లో విభిన్న వాతావరణం.. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరిలో వర్షా లు
- తెలంగాణలోని పలు జిల్లాలు పిడుగులతో వర్షా లు



నైరుతి రుతుపవనాలు కేరళంను తాకాయి. దీని ప్రభావంతో కర్నాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల్లో గత రాత్రి నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ, ఏపీలో కూడా గురువారం నుంచి పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది. నైరుతి రుతుపవనాలు కేరళంను తాకడంతో రుతు పవనాల వేగం, తీవ్రత కారణంగా పొరుగు రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణలోనూ భారీ మేఘాలు కమ్ముకుంటున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. మరోవైపు.. ప్రస్తుతం అరేబియా సముద్రం, లక్షద్వీప్, బంగాళాఖాతం అంతటా ఈ రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయని వాతావరణ అధికారులు వెల్లడించారు.



- కాంగ్రెస్ టార్గెట్ పవనా?.. లేక భవిష్యత్ కూటముల భయమా?
- బీజేపీ-జనసేనకు బీఆర్ఎస్ దగ్గరవుతోందా?
- పర్మిషన్ వివాదం వెనుక ఎన్నికల వ్యూహాలేనా?
- పవన్పై కాంగ్రెస్ దూకుడు.. కేసీఆర్పై పవన్ ప్రశంసలు
- జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్?..
- పవన్ను తెలంగాణ వ్యతిరేకిగా చూపించే ప్రయత్నమా?
- తెలంగాణలో మారుతున్న సమీకరణాలు

# పవన్ చుట్టూ..

బీజేపీ+బీఆర్ఎస్+జనసేన పొత్తు?

## తెలంగాణ రాజకీయాలు

### కాంగ్రెస్ దూకుడు వెనుక ఎన్నికల వ్యూహం?!

**ముద్ర డెస్క్ :**
జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హైదరాబాద్ పర్యటన చుట్టూ నెలకొన్న రాజకీయ పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. గచ్చిబౌలిలో నిర్వహించాలనుకున్న సమావేశానికి అనుమతి నిరాకరణ, అనంతరం కాంగ్రెస్ నేతల తీవ్ర విమర్శలు, పవన్ కల్యాణ్ ప్రతిస్పందనతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ వివాదం కేవలం ఒక సమావేశానికి పరిమితం కాకుండా భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై సంకేతాలు ఇస్తోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**కాంగ్రెస్ ఆందోళనకు కారణమేంటి?**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ఒంటరిగా పెద్ద సవాలు విసరలేని పరిస్థితుల్లో, పవన్ కల్యాణ్ ప్రభావం బీజేపీకి తోడైతే రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆంధ్రా సెటిలర్లు, యువత, కొన్ని సామాజిక వర్గాల్లో పవన్కు ఉన్న ఆదరణ భవిష్యత్ ఎన్నికల్లో ప్రభావం చూపవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు పవన్పై దూకుడుగా స్పందించడం వెనుక రాజకీయ లెక్కలు ఉన్నాయనే చర్చ సాగుతోంది. తెలంగాణ భావోద్వేగాలను ముందుకు తెచ్చి పవన్ను తెలంగాణ వ్యతిరేకిగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ప్రత్యర్థి పార్టీలు ఆరోపిస్తున్నాయి.

**కేసీఆర్పై పవన్ ప్రశంసలు**
ఈ పరిణామాల్లో మరో ఆసక్తికర అంశం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్పై పవన్ కల్యాణ్ చేసిన ప్రశంసలు. కేసీఆర్ ఎప్పుడూ ఆంధ్రా ప్రజలను అవమానించలేదని పవన్ పేర్కొనడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మరోవైపు మిగతా 02లో

## ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఛైర్మన్ కేకే



- విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తాం
- ఉద్యమకారుల సంక్షేమంపై అఖిల పక్షం సమావేశం

02

## అమరావతి ఐ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్

రిటైర్మెంట్ వయసు 62కు పెంపు

కొత్త పాలసీలు, ప్రాజెక్టులకు ఓకే

- విశాఖ, చీరాలలో బీచ్ షాక్స్ ఏర్పాటు
- కీలక నిర్ణయాలకు ఏపీ మంత్రివర్గం ఆమోదం

02



## సెంటిమెంట్ రెచ్చగొట్టే ప్రయత్నం

బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్ రావు



- పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడలేదు
- పవన్ కల్యాణ్ సమావేశానికి అనుమతి ఇస్తే ఏమౌతుంది?

02



## భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదు

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదు
- సందేహాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 4788
- వాట్స్ యాప్ నెంబర్ 8247619983

04

## వైఎస్సార్‌పై ఆరోపణలు చేస్తే రూ.10 కోట్ల ఛాలెంజ్

పవన్‌కల్యాణ్‌కు కేవీపీ ఘాటు లేఖ

- వైఎస్సార్‌పై ఆరోపణలు అవివేకమన్న మాజీ ఎంపీ
- లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం.. రూ.10 కోట్లు ఇస్తానన్న కేవీపీ
- వైఎస్సార్‌కు, వైసీపీకి సంబంధం లేదంటూ మాజీ ఎంపీ స్పష్టం
- 17 ఏళ్ల తర్వాత కూడా వైఎస్సార్‌ను లక్ష్యంగా చేసుకోవడం ఏంటి?
- కాంగ్రెస్ బలంపై కేవీపీ ఆసక్తికర వ్యాఖ్యలు

03

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యంగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిపై పవన్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ ఆయన ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. వైఎస్సార్ హయాంలో పవన్‌పై కేసులు పెట్టించారన్న ఆరోపణలపై కేవీపీ సంచలన సవాల్ విసిరారు. సదరు పోలీస్ అధికారికి లై డిటెక్టర్ పరీక్ష జరపాలని, అందులో నిజం తేలితే రూ.10 కోట్లు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. వైఎస్సార్ మరణించి 17 ఏళ్లవుతున్నా ఇంకా ఆయనను లక్ష్యంగా చేసుకోవడం అవివేకమని మండిపడిన కేవీపీ.. వైఎస్సార్‌కు, ప్రస్తుత వైసీపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.



## రేవంత్ బావమరిది ₹15 కోట్ల స్కామ్

బీఆర్ఎస్ నేత కేటీఆర్

- డైవర్ట్ చేసేందుకే బాల్క సుమన్ అరెస్ట్
- చంచల్ గూడ జైలులో బాల్కతో కేటీఆర్ ములాఖత్

06



సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును లేనిది ఉన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. వివాదస్పదవ్యాఖ్యాల కేసులో అరెస్ట్ అయి చంచల్ గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ములాఖత్లో కలిసి అనంతరం మీడియాతో మాట్లాడారు.

## ఈగల్ వేట!

గంజాయి రవాణాపై కొరడా



- థాయ్‌లాండ్, హైదరాబాద్, ముంబై కేంద్రాలుగా భారీ నెట్‌వర్క్‌తో రవాణా
- 12.739 కిలోల ప్రీమియం హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం
- మూడొందల మంది క్యారియర్లతో థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు రవాణా
- అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా గుట్టు రట్టు

02

## ఏసీబీకి చిక్కిన ఎఫ్ఆర్ఓ

- కొడిమ్యాల ఫారెస్ట్ కార్యాలయంలో కలకలం
- పక్కా ప్రణాళికతో ఆపరేషన్
- రూ.80 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ ఆఫీసర్

04

## ఉద్యోగుల వ్యతిరేకి కాంగ్రెస్



- దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరు డీఏలు పెండింగ్
- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానా కొత్త పీఆర్సీ ప్రకటించలేదు

02


# హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

సుడాన్ నుంచి వచ్చిన విదేశీయుడికి లక్షణాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
హైదరాబాద్‌లో ఎబోలా వైరస్ కలకలం రేపింది. సుడాన్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఓ విదేశీయుడిలో ఎబోలా లక్షణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన స్కానింగ్ వ్యవస్థ ద్వారా అనుమానాస్పద లక్షణాలు బయటపడటంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రత్యేక ఎబోలా వార్డులో ఉంచి చికిత్స అందిస్తుండగా, నిర్ధారణ కోసం శాంపిల్స్‌ను సీసీఎంబీకి పంపించారు. ప్రస్తుతం ఎబోలా వైరస్ మధ్య ఆఫ్రికా దేశాల్లో వేగంగా వ్యాపిస్తుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా అప్రమత్తమై విమానాశ్రయాలు, ఓడరేవుల్లో నిఘాను మిగతా 02లో



- శంషాబాద్ ఎయిర్ పోర్టులో గుర్తింపు.. గాంధీ ఆస్పత్రికి తరలింపు
- ఆఫ్రికాలో ఎబోలా విజృంభణ ప్రభావం..
- భారత్‌లో విమానాశ్రయాల్లో నిఘా మరింత కట్టుదిట్టం
- గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా ఎబోలా..
- విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక పర్యవేక్షణ



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 05.06.2026
www.mudranews.in | @mudranews



## టీ-సిగరెట్ కాంబోతో గుండెకు డబుల్ షాక్



సిగరెట్‌లోని నికోటిన్, టీలోని కెఫీన్ కలిసి గుండెపై తీవ్ర ఒత్తిడి పెంచుతాయి. ఈ అలవాటు వల్ల అధిక రక్తపోటు, గుండెపోటు ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది.

# భారీ అగ్ని ప్రమాదం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
హైదరాబాద్ సిటీ నడిబొడ్డు అమీర్‌పేటలో మెయిన్ రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మైత్రీవనం సమీపంలో మెయిన్ రోడ్డుపైనే ఉన్న ఓ బొమ్మల దుకాణంలో మంటలు చెలరేగాయి. అవి ఆర్పేలోపు మొత్తం ఆ బిల్డింగ్‌లో ఉన్న అని దుకాణాలకు వ్యాపించాయి. చుట్టుపక్కల షాపులు అన్నీ అగ్నికి ఆహుతైపోయాయి. భారీగా ఎగసి పడుతున్న మంటలు కమ్ముకున్న పొగతో ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది.

**బొమ్మల దుకాణం నుంచి..**
బొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న KSR ఫ్యాషన్స్ అనే బట్టల దుకాణానికి అంటుకోవడంతోనే మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. మొత్తం బిల్డింగ్ మంటలు వ్యాపించాయి. బిల్డింగ్ మొత్తం నిలువెల్లా తగలబడిపోయింది. భగభగ మండే మంటలతో దగ్గరకు వెళ్లటానికి సైతం అగ్నిమాప సిబ్బంది భయపడిపోయారు. బిల్డింగ్ మొత్తం మంటల్లో కాలిపోతున్న విజువల్స్ చుట్టు పక్కల వాళ్లను భయాందోళనలకు గురిచేశాయి. మూడు అంతస్తుల ఈ బిల్డింగ్ మొత్తం కాలిబూడిదైంది. ఈ బిల్డింగ్ చుట్టూ హోటళ్లు, రెస్టారెంట్లు, కంప్యూటర్ షాపులు, సెల్ ఫోన్ షాపులు ఇలా చాలా షాపులు ఉన్నాయి. వీటిలో 20కిపైగా షాపులు కాలిబూడిదైనట్టు తెలుస్తోంది. మండే ఎండలకు మంటలు చుట్టుపక్కల ఉన్న షాపులకు వ్యాపించాయి. మంటల ధాటికి చుట్టుపక్కల ఉన్న వ్యాపారులు అందరూ వారి షాపుల్లోని విలువైన వస్తువులను బయటకు తీసుకొచ్చి.. అక్కడి నుంచి పరుగులు తీశారు.



### తెలంగాణ సెంటిమెంట్‌ను
# రెచ్చగొట్టే ప్రయత్నం


**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



బీఆర్ఎస్ నేతలు మరోసారి తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదన్నారు. తెలంగాణను వ్యతి రేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. హైదరాబాద్ లో పవన్ కల్యాణ్ సమావేశానికి అనుమతి ఇస్తే ఏమవుతుందని ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణను వ్యతిరేకించిన నేతలకు కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారన్న రాంచందర్ రావు.. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగా ణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ మద్దతుతోనే తెలంగాణ రాష్ట్రంగా అవతరించిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైందని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ పవర్ అని అభివర్ణించారు.


# పవన్ చుట్టూ తెలంగాణ రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఈ అంశంలో పవన్‌పై నేరుగా విమర్శలు చేయకుండా స్పందించడం గమనార్హంగా మారింది. దీంతో భవిష్యత్తులో జనసేన–బీఆర్ఎస్ మధ్య రాజకీయ అవగాహనకు అవకాశం ఉందా అనే చర్చ మొదలైంది.


**కొత్త కూటమి అవకాశాలపై చర్చ**
రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరన్న నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ, జనసేన, బీఆర్ఎస్ కలిసి పనిచేసే పరిస్థితులు ఏర్పడతాయా అనే ప్రశ్న రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఇప్పటివరకు అలాంటి పొత్తుపై ఏ పార్టీ అధికారికంగా ప్రకటించలేదు. అయినప్పటికీ ఇటీవల జరిగిన పరిణామాలు, నేతల వ్యాఖ్యలు, పరస్పర వైఖరులు భవిష్యత్ రాజకీయ దిశపై ఆసక్తిని పెంచుతున్నాయి.



Telangana

తెలంగాణ రాజకీయాల్లో పవన్ ఫ్యాక్టర్ హైదరాబాద్ ఘటనతో పవన్ కల్యాణ్ పేరు తెలంగాణ రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ దూకుడు విమర్శలు, బీఆర్ఎస్ మితమైన స్పందన, బీజేపీ మద్దతు నేపథ్యంలో పవన్ కల్యాణ్ చుట్టూ కొత్త రాజకీయ చర్చ మొదలైంది. రాబోయే జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల దిశగా ఈ పరిణామాలు ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

### ఉద్యమకారులకు
# న్యాయం చేస్తాం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఛైర్మన్ కే. కేశవరావు (కేకే) తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ప్రతి ఒక్కరిని గుర్తించే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలు, వివిధ వర్గాల ప్రతినిధులతో మరోసారి సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరిస్తామని వెల్లడించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఉద్యమకారులకు న్యాయం చేయడంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగులు, విద్యార్థులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కవులు, కళాకారులు సహా తెలంగాణ సాధన కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరిని గుర్తిస్తామని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సూచనలు, వినతిపత్రాలు స్వీకరిస్తామని చెప్పారు.
ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ, ఉద్యమంలో జీవితాన్ని అంకితం చేసిన అనేక మంది కార్యకర్తలు తమకు గుర్తింపు, సహాయం కావాలని కోరుతున్నారని చెప్పారు. ఉద్యమ జేఏసీలు, విశ్వవిద్యాలయ జేఏసీలతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీలు, యూనివర్సిటీ జేఏసీలతో చర్చించి అందరి సూచనల ఆధారంగా ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమంలో భాగమైన ప్రతి ఒక్కరికీ గౌరవం దక్కేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# ఈగల్ వేట!

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
మాదకద్రవ్యాల రవాణా పై రాష్ట్ర ఈగిల్ ఫోర్స్ పంజా విసిరింది. అంతర్జాతీయ హైడ్రోపోనిక్ గంజాయి స్మగ్లింగ్ ముఠాను హైదరాబాద్ లో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నది. థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు అక్రమ రవాణా చేస్తున్న ఓ వ్యక్తి వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నది. పోలీసులు, కస్టమ్స్ అధికారులు సమన్వయంతో నిర్వహించిన ఈ ఆపరేషన్ లో సంచలన విషయాలు వెలుగు చూశాయి. థాయ్‌లాండ్, హైదరాబాద్, ముంబై కేంద్రాలుగా భారీ నెట్‌వర్క్‌ను నడిపిస్తూ మూడొందల మంది క్యారియర్లను ఉపయోగించి థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు హైడ్రోపోనిక్ గంజాయిని తరలించినట్లు ఈగిల్ ఫోర్స్ గుర్తించింది. థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు అధిక టిహెచ్ సి శాతం కలిగిన ప్రీమియం హైడ్రోపోనిక్ గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఈ ముఠా గతంలో అరుదైన వస్తువుల స్మగ్లింగ్ లో పాల్గొనేదని పోలీసులు తెలిపారు. అయితే 2023 నుంచి రూట్ మార్చిన ఈ గ్యాంగ్ అప్పటి నుంచి వస్తువుల స్మగ్లింగ్ స్థానంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై దృష్టి సారించినట్లు తమ దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. 2026 ఏప్రిల్ 8న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు బ్యాంకాక్ నుంచి వచ్చిన సోధా మొహసన్ బహదూర్ భాయ్ అనే ప్రయాణికుడి వద్ద 13.2 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

**ముంబై–హైదరాబాద్–థాయ్‌లాండ్ నెట్‌వర్క్**
సోధా మొహసన్ బహదూర్ భాయ్ అరెస్టు అనంతరం రాచకొండ పోలీసులు, కస్టమ్స్ అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్‌లో హరషద్ మన్‌సుఖ్ భాయ్ ప్రజాపతి, సందీప్ వాసాని అలియాస్ రాహుల్ జైన్‌లను అరెస్ట్ చేసి మరో 12.739 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో ఈ ముఠా థాయ్‌లాండ్, హైదరాబాద్, ముంబై




కేంద్రాలుగా భారీ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నట్లు బయటపడింది. గుజరాత్‌కు చెందిన దల్ అబ్దుల్లా సదుద్దీన్ నాయ్ అనే వ్యక్తి యువకులను ప్రలోభపెట్టి థాయ్‌లాండ్ నుంచి గంజాయి రవాణా చేయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఎన్డీపీఎస్ చట్టంలోని పలు సెక్షన్లతో పాటు భారతీయ న్యాయ సంహిత కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో మొత్తం 40 మంది నిందితులను గుర్తించారు. వీరిలో పలువురు అరెస్టు కాగా, మరికొందరు పరారీలో ఉన్నారు. ముంబైకి చెందిన హేమంగ్ ప్రమోద్ కెలుస్కర్ ఈ రాకెట్‌కు ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. అతడు, అతని సోదరుడు సుధాంశు కెలుస్కర్ థాయ్‌లాండ్‌లో క్లబ్ వ్యాపారం నిర్వహిస్తూ గంజాయి స్మగ్లింగ్‌కు కేంద్రంగా ఉపయోగించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ స్మగ్లింగ్‌లో కస్టమ్స్ నిఘా నుంచి తప్పించుకోవడానికి వివిధ విమానాశ్రయాలను మారుస్తూ అక్రమ రవాణా కొనసాగించినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. గంజాయి వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని, మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి, భవిష్యత్తుకు హానికరమని ఈగిల్ ఫోర్స్ హెచ్చరించింది. యువత డ్రగ్స్, హానికర ఇంజెక్షన్లు, నియంత్రణలేని సప్లిమెంట్లకు దూరంగా ఉండాలని సూచించింది. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే 1908 నంబర్ లేదా ఈగిల్ ఫోర్స్ అధికారిక మార్గాల ద్వారా అందించాలని విజ్ఞప్తి చేసింది.


# ఉద్యోగుల వ్యతిరేకి కాంగ్రెస్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా ఏకంగా ఆరు డీఏలను పెండింగ్‌లో పెట్టడం దారుణమని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన కొత్త పీఆర్సీ ప్రకటన వస్తుందని ఉద్యోగులు ఆశగా ఎదురుచూసినా నిరాశే మిగిల్చిందదన్నారు. ఖైరతాబాద్‌లోని జలమండలి గేట్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను, కార్మికులను ఘోరంగా మోసం చేస్తోందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జలమండలిలో ఎలాంటి లంచాలు లేకుండా ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పదోన్నతులు కల్పించామని హరీశ్ రావు గుర్తు చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ప్రశ్నించే గొంతుక అవసరమని పిలుపునిచ్చారు. ఏడాది క్రితం పటాన్‌చెరు సిగాచి పరిశ్రమలో బాయిలర్ పేలి చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇస్తామని చెప్పి ఏడాది గడిచినా, ఇప్పటివరకు ఎలాంటి అతీగతీ లేదని దుయ్యబట్టారు. జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, సింగరేణి కార్మికులను ఈ ప్రభుత్వం పూర్తిగా వంచించిందని.. రెండున్నరేళ్లు గడుస్తున్నా కనీసం పీఆర్సీ ప్రకటన కూడా లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ఎబోలా కలకలం

(మొదటి పేజీ తరువాయి)
కట్టుదిట్టం చేసింది. తెలంగాణలో ఎబోలా లక్షణాలతో వ్యక్తి గుర్తించడం ఇదే తొలిసారి కావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. అయితే పరీక్షల ఫలితాలు వచ్చే వరకు అధికారికంగా ఎబోలా కేసుగా నిర్ధారించలేమని వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు.
ఐసోలేషన్ నుంచి ఎబోలా పేషంట్ల పరార్: ఆఫ్రికా ఖండంలో ఎబోలా వైరస్ విజృంభణ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఈ భయంతో అక్కడ ప్రభుత్వాలు చేపడుతున్న సహాయక కార్యక్రమాలపై స్థానికులు దాడులకు తెగబడుతున్నారు. తాజాగా కాంగోలోని కివులోని కటానా పట్టణంలో ఎబోలా వైరస్ బారిన పడి చనిపోయిన వ్యక్తికి అంత్యక్రియలు చేస్తున్న బృందంపై కొందరు మూక దాడికి పాల్పడ్డారు. దీంతో వారు ఆ డెడ్ బాడీని అక్కడే వదిలేసి తమ ప్రాణాలు కాపాడుకునేందుకు అక్కడి నుంచి పారిపోయారు. తమ ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహిస్తే ఆ వైరస్ తమకూ సోకుతుందనే భయంతో ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారు. ఇదిలా ఉంటే ఎబోలా వైరస్ సోకిన 11 మంది పేషెంట్లు ఐసోలేషన్ కేంద్రాల నుంచి పరారయ్యారు. మరికొన్ని ప్రాంతాల్లో ఐసోలేషన్ కేంద్రాలపై స్థానికులు దాడులకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది.



# అమరావతి ఐకు గ్రీన్‌సిగ్నల్

**ముద్ర, అమరావతి:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయాలతో ముందుకెళ్తోంది. ముఖ్యమంత్రి చంద్రాబాబు నాయుడు అధ్యక్షతన సుమారు మూడు గంటలపాటు జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు అభివృద్ధి, సంక్షేమ, పరిపాలనా అంశాలకు ఆమోదం లభించింది. ముఖ్యంగా కృష్ణా నదీ తీరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 'అమరావతి ఐ' ప్రాజెక్టు టెండర్లకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. అలాగే ఆంధ్రప్రదేశ్ రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ–2025 ముసాయిదాకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మద్దువలస, ఏలేరు రిజర్వాయర్లలో కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు కూడా అనుమతి లభించింది. రాష్ట్ర విమానయాన రంగ అభివృద్ధికి దోహదపడే ఏపీ ఏవియేషన్ పాలసీ–2026కు కూడా ఆమోద ముద్ర పడింది.అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టుకు కేటాయించిన భూముల రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులను మినహాయించాలని నిర్ణయించింది. మానవ అవయవాల మార్పిడి చట్టం అమలుకు అవసరమైన ఆర్డినెన్స్ జారీ ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ అంగీకారం తెలిపింది. పర్యాటక రంగ ప్రోత్సాహానికి విశాఖపట్నం, చీరాల తీర ప్రాంతాల్లో బీచ్ షాక్స్ ఏర్పాటుకు వీలుగా ఎక్సైజ్ పాలసీ మార్గదర్శకాలకు ఆమోదం లభించింది. అలాగే పోలవరం సహా పలు సాగునీటి ప్రాజెక్టుల పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.
విద్యుత్ రంగానికి సంబంధించిన అంశాల్లో హడ్కో నుంచి రూ.300 కోట్ల రుణం పొందేందుకు ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ప్రభుత్వ హామీ ఇవ్వాలని నిర్ణయించింది. మరో కీలక నిర్ణయంగా ప్రభుత్వరంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.అదనంగా జులై 1 నుంచి వీబీ–జీ–రాంజీ అమలుకు ఆమోదం తెలిపిన క్యాబినెట్, పలు సంస్థలకు భూ కేటాయింపులకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగావకాశాల పెంపు లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# రక్త సముద్రం..



**ముద్ర డెస్క్:**
సంస్కృతి సంప్రదాయాలకు ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో విలువ ఉంటుంది. ఎందుకంటే ఆ సంప్రదాయానే మన జీవనానికి, మనుగడకు పునాది. అందుకే కులం, మతం తేడా లేకుండా అందరూ సంప్రదాయానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. వస్త్రధారణ, ఆహారపు అలవాట్లు ఇలా అనేక రకాల జీవన శైలులు ఇందులో భాగమే అయితే కొన్ని రకాల జీవన శైలులు ఒళ్లు గగ్గురు పొడిచేలా ఉంటాయి. అలాంటి వాటిలో ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలోని డెన్మార్క్‌కు చెందిన స్వయంప్రతిపత్తి ప్రాంతం ఫారో ఐలాండ్స్ అచారం ఒకటి. ఇక్కడ వెయ్యేళ్లుగా కొనసాగుతున్న ఒక ప్రాచీన ఆచారం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వివాదాలకు దారి తీస్తోంది. ఈ సంప్రదాయం పేరుతో ఇటీవలి ఒక రోజులోనే 700కి పైగా పైలట్ వేల్స్ (తిమింగలాలు), వైట్–సైడెడ్ డాల్ఫిన్లను చంపేశారు. ఈ ఘటన సోషల్ మీడియాలో భారీగా వైరలై ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

**వెయ్యేళ్ల సంప్రదాయం..**
ఫారో ఐలాండ్స్‌లో 'గ్రైండడ్రాప్' అనే సంప్రదాయం చాలా కాలం నుంచి ఉంది. దీని కింద పెద్ద సంఖ్యలో తిమింగలాలు, డాల్ఫిన్లను బోట్లతో తీరానికి తీసుకువస్తారు. తర్వాత వాటిని చంపి మాంసం, నూనెను స్థానికుల ఆహారం కోసం పంచుతారు. స్థానికులు దీనిని తమ సంస్కృతి, ఆహార అవసరాలు, సామూహిక జీవన విధానంలో భాగంగా చూస్తారు. ఇది స్థిరమైన, అవసరమైన సంప్రదాయం. ఈసారి జరిగిన ఘటనే చివరి వారంలో ఫారో ఐలాండ్స్‌లో 3 ప్రత్యేక స్థలాల్లో ఈ హంట్ జరిగింది. ఒక్క రోజులోనే సుమారు 700కి పైగా తిమింగలాలు డాల్ఫిన్లు చంపబడ్డాయి.

**జంతు ప్రేమికుల ఆగ్రహం..**
ఈ ఘటనను జంతు హక్కుల సంఘాలు, పర్యావరణవాదులు తీవ్రంగా స్పందించారు. అనవసరమైన, క్రూరమైన హత్యాకాండంగా అభివర్ణిస్తున్నారు. చాలా మంది నెటిజన్లు ‘‘ఇది సంప్రదాయం కాదు, క్రూరత్వం’’ అంటూ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ ఆచారం పట్ల అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతోంది.

**సంప్రదాయం మాటున అనైతికత**
ఫారో ఐలాండ్స్ ప్రజలు ఈ సంప్రదాయాన్ని తమ సంస్కృతి, ఆత్మగౌరవంతో ముడిపెట్టి చూస్తున్నారు. ఇది వారి ఆహార భద్రతకు కూడా సంబంధించిన విషయం. అయితే ఆధునిక కాలంలో జంతు సంరక్షణ, పర్యావరణ సమతుల్యత, జీవుల పట్ల దయ వంటి విలువలు బలంగా మారాయి. తిమింగలాలు, డాల్ఫిన్లు అత్యంత తెలివైన సముద్ర జీవులు. వాటిని ఇలా సామూహికంగా చంపడం మానవతా దృక్పథంతో సరిపోదని ప్రపంచవ్యాప్త భావన ఏర్పడుతోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 05.06.2026
www.mudranews.in | @mudranews



## టీ-సిగరెట్ కాంబోతో



ఊపిరితిత్తులను నెమ్మదిగా దెబ్బతీస్తుంది సిగరెట్ పొగ ఊపిరి తిత్తుల పనితీరును తగ్గించి శ్వాస సమస్యలకు దారితీస్తుంది. టీ బ్రేక్ పేరుతో ఎక్కువ సిగరెట్లు తాగడం వల్ల నష్టం మరింత వేగంగా జరుగుతుంది.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ పట్టణంలోని 8వ వార్డులో నగర అభివృద్ధి నిధుల ద్వారా మంజూరైన రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఓపెన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గంలోని కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాప్రా, హెచ్‌బీ కాలనీ, మల్లాపూర్, నాచారం డివిజన్లలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైన్లు, కమ్యూనిటీ హాల్స్, పార్కుల అభివృద్ధి వంటి పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి విటల్ నాయక్ పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి



**ముద్ర, కాప్రా:** నాచారం డివిజన్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాల్సిందిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ జలమండలి ఈ డి పంకజ ని కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే నాచారం డివిజన్లోని చాలావరకు డ్రైనేజీ సమస్యలను పరిష్కరించామని మిగిలిన కొన్ని పనులకు నిధులు మంజూరు చేసినట్లయితే డివిజన్లో డ్రైనేజీ సమస్యలు పూర్తిగా తీరుతాయని తెలియజేశారు. అలాగే కొన్ని మంజూరైన రోడ్లు డ్రైనేజీ ఏర్పాటు కాకపోవడం వల్ల ఆగిపోయాయని ఈడి దృష్టికి తీసుకొని రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన నూతన డీటీవో



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లాకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీటీఓ ఇమ్రాన్ హైమాత్, డిప్యూటీ డీటీఓతో కలిసి స్థానిక శాసనసభ్యులు కూచుకుళ్ల రాజేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి నూతన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేసి, జిల్లాలో రవాణా శాఖ సేవలను మరింత మెరుగుపరుస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రవాణా శాఖ డైరెక్టర్ ఎదుల గోపాల్ రెడ్డి నూతన డీటీఓ ఇమ్రాన్ హైమాత్, డిప్యూటీ డీటీఓలకు స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.

## జర్నలిస్టు కూతురు చదువుకు ఆర్థికసాయం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** పదర మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్టు రామస్వామి కుమార్తె హైదరాబాద్‌లో ఏజీబీఎస్సీ విద్యను అభ్యసిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కళాశాల ఫీజులు, మెస్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడినట్లు తెలిసిన నేపథ్యంలో ఐజేయూ నాగర్‌కర్నూల్ జిల్లా నేషనల్ కౌన్సిల్ సభ్యుడు గోలి సుదర్శన్ రెడ్డి రూ.10 వేలు, మరో జర్నలిస్టు, ఐజేయూ సభ్యుడు రూ.5 వేలు కలిపి రూ.15వేలను గురువారం రామస్వామికి అందించారు. టీయూడబ్ల్యూజే–ఐజేయూ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు పి. విజయకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రమణ కుమార్, జయప్రసాద్, పాలాది యాదయ్య, సీనియర్ నాయకులు కొండకింది మాధవరెడ్డి, నాగర్‌కర్నూల్ తాలూకా ఉపాధ్యక్షుడు జంగిటి రాంప్రకాష్ పాల్గొన్నారు.

## 7న కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏల శిక్షణ కార్యక్రమం

**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 7న ఆదివారం ఉదయం 10 గంటల తులసీ గార్డెన్స్ తాండూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ BLAల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీపీసీసీ అధిష్టానం ఆదేశాల మేరకు తాండూర్ ఎమ్మెల్యే సూచనతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాండూర్ నియోజకవర్గ సర్, కన్వీనర్ కరణము పురుషోత్తం రావు అధ్యక్షతన సన్నాహాక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధిగా సర్ రాష్ట్ర కన్వీనర్,పరిగి ఎమ్మెల్యే టి. రాం మెహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారసింగ్, టీపీసీసీ తరుపున SIR పై అవగాహనా కల్పించడానికి పలువురు ట్రైనర్స్ కార్యక్రమంకు హాజరు కానున్నట్లు తెలిపారు.

## 10న ఉచిత కంటి చికిత్స శిబిరం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా అందత్వ నియంత్రణ సంస ఆధ్వర్యం లో నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ, రామకృష్ణ టాకీస్ రోడ్డు లో గల శోభ ఆప్టికల్ లో ఈనెల 10న బుధవారం నాడు ఉదయం 9గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి తెలిపారు.ఈ శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పోరగల వారినీ ప్రత్యేక అంబులెన్స్ ద్వారా లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రి, ఎనుగొండ,మహబూబ్ నగర్ కి పంపించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనునట్లు తెలిపారు.రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా రక్తపరీక్షలు,సాధారణ పరీక్షలు, ప్రతిరోజు నిర్వహిస్తారని తెలిపారు.శిబిరానికి వచ్చే ముందు ఆధార్ కార్డు,ఓటర్ కార్డ్, లేదా రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు.మరిన్ని వివరాల కు 9440454284, 8106333324 నెంబర్ లలో సంప్రదించాలని కోరారు.

# వైఎస్సార్‌పై ఆరోపణలు చేస్తే రూ.10 కోట్ల ఛాలెంజ్

– వైఎస్సార్‌పై ఆరోపణలు అవివేకమన్న మాజీ ఎంపీ కేవీపీ రాంచందర్ రావు
– పవన్‌కల్యాణ్‌కు కేవీపీ ఘాటు లేఖ





**ముద్ర, హైదరాబాద్:** జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రాంచంద్రరావు తీవ్రంగా స్పందించారు. వైఎస్సార్‌పై చేసిన ఆరోపణలను ఖండిస్తూ పవన్‌కల్యాణ్‌కు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ పేరు వినగానే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి గుర్తుకు వచ్చారని పేర్కొంటూ పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అయితే వైఎస్సార్ విషయంలో చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. వైఎస్సార్‌కు, ప్రస్తుతం ఉన్న వైసీపీకి ఎలాంటి సంబంధం లేదని కేవీపీ పేర్కొన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పవన్‌కల్యాణ్‌పై ఎలాంటి కేసులు నమోదు కాలేదని ఆయన గుర్తుచేశారు. వైఎస్సార్ ఆదేశాల మేరకు కేసులు పెట్టామని చెప్పిన పోలీసు అధికారికి లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆ అధికారి చెప్పింది నిజమని తేలితే తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి లేదా ఏదైనా స్వచ్ఛంద సంస్థకు రూ.10 కోట్లు విరాళంగా ఇస్తానని కేవీపీ ప్రకటించారు. వైఎస్సార్ మరణించి 17 సంవత్సరాలు గడిచినా ఆయనపై ఆరోపణలు చేయడం అవివేకమని కేవీపీ వ్యాఖ్యానించారు. ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడి వారసత్వాన్ని దెబ్బతీయాలనే ప్రయత్నాలు సరికావని అన్నారు.అలాగే తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని పేర్కొన్న కేవీపీ, తెలంగాణలో ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. అవసరమైతే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై లేదా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. కేవీపీ లేఖతో కాంగ్రెస్, జనసేన వర్గాల్లో రాజకీయ చర్చ మరింత వేడెక్కింది.

# సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

350 మంది పోలీసులతో బందోబస్తు
– ఇన్‌చార్జ్ ఎస్పీ సునీత రెడ్డి



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** రాష్ట్ర ముఖ్యమంత్రి కుమ్మేర పంప్‌హౌస్ పర్యటన నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కార్యక్రమ ఇంచార్జ్, వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ కార్యక్రమమని, భద్రతా నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆమె స్పష్టం చేశారు.గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సుఖ్ జీవన్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బందోబస్తు విధుల్లో పాల్గొనే వివిధ జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడారు. జూన్ 5న ముఖ్యమంత్రి కుమ్మేర పంప్‌హౌస్‌ను సందర్శించనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి అధికారి, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.భద్రతా ఏర్పాట్లలో భాగంగా మొత్తం ప్రాంతాన్ని మూడు సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. బందోబస్తు కోసం ఒక ఎస్పీ, ఒక అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, 23 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, 57 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 253 మరది కానిస్టేబుళ్లు, మహిళా హోంగార్డులు, స్పెషల్ పార్టీలు, రోప్ పార్టీలు, బీడీ టీమ్‌లు, డాగ్ స్క్వాడ్, సెక్యూరిటీ వింగ్, మఫ్టీ పార్టీలతో కలిపి 350 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించినట్లు వెల్లడించారు.విధుల సమయంలో సెల్‌ఫోన్లలో నిమగ్నమవడం, వ్యక్తిగత పనుల్లో పాల్గొనడం వంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమకు కేటాయించిన పాయింట్ వద్ద అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ట్రాఫిక్, పార్కింగ్, రోప్ పార్టీలు, బీడీ టీమ్‌లు, భద్రతా విభాగాల మధ్య సమన్వయంతో పూర్తి స్థాయి భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూనే భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదన్నారు.డ్యూటీ సమయంలో క్రమశిక్షణ, సమయపాలన, అప్రమత్తత అత్యంత కీలకమని పేర్కొన్న ఎస్పీ, విధుల్లో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం లేదా ఆదేశాల ఉల్లంఘనకు పాల్పడిన వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, కల్వకుర్తి డీఎస్పీ వెంకట్ రెడ్డి, నాగర్‌కర్నూల్ సీఐ అశోక్ రెడ్డి, కొత్తకోట సీఐ రాంబాబు, వనపర్తి సీఐ రత్నం, నాగర్‌కర్నూల్ ఎస్సై గోవర్ధన్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

ఖైరతాబాద్ లో పర్యటించిన గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ వి.పి.గౌతం



**ముద్ర, హైదరాబాద్ :** క్యూర్ ఏరియా పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు –ఎల్ఐజి హౌసింగ్ స్కీం ను అమలు చేసేందుకు అనువైన స్థలాలను గుర్తించే ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లోనూ భూములను హౌసింగ్ బోర్డు, రెవెన్యూ అధికారులు గుర్తించగా, గురువారం నాడు ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ వి.పి.గౌతం పర్యటించారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని ఉన్న హౌసింగ్ బోర్డు స్థలాలు, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఎటువంటి తరహా నిర్మాణాలను చేపట్టాలన్న దానిపై సమగ్రమైన ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 3 గంటల పాటు రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. అంబేద్కర్ నగర్ లోని 2 బిహెచ్ కె నిర్మాణాలను పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. క్యూర్ ఏరియా పరిధిలో పైలట్ ప్రాజెక్టు కింద 12,000 ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున, అందుకు తగ్గట్లుగా నిర్మాణాలను చేపట్టడానికి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా స్లమ్ రీ డెవలప్ మెంట్, ఎల్ ఐజి నిర్మాణాలు వంటి కార్యక్రమాల్లో ఏ భూములను వేటికి వినియోగించనున్నారన్న సమాచారాన్ని అధికారుల నుంచి ప్రత్యేక కార్యదర్శి శ్రీ వి.పి.గౌతం తెలుసుకున్నారు. గృహ నిర్మాణ పథకాలు చేపట్టడానికి అనువుగా లేని భూముల విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై కూడా క్షేత్ర స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు.ప్రశాశన్ నగర్, బిఎన్ఆర్ నగర్, జర్నలిస్టు కాలనీ, ఎంఆర్ సి కాలనీ, పద్మాలయా స్టూడియోస్ సమీపంలోని అంబేద్కర్ నగర్, హకీంబాబా దర్గా, జహీరానగర్, గురుబ్రహ్మనగర్, దుర్గాభవాని నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. గృహ నిర్మాణ పథకాల అమలు చేయడానికి అనువైన సుమారు 15 భూములను ఏ పథకాలకు వినియోగించాలన్న దానిపై సమగ్రమైన డిపిఆర్ ను రూపొందించి వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపాలని ఆయన సూచించారు. ఈ పర్యటనలో హైదరాబాద్ జిల్లా హౌసింగ్ పిడి అశోక్ చక్రవర్తి, హౌసింగ్ బోర్డు అధికారులు డి. మధుకర్ రెడ్డి, జి. వాణి, రవీందర్ రెడ్డి లతో పాటు స్థానిక తహశీల్దార్ శ్రీమతి అనిత తదితరులు పాల్గొన్నారు.

## కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్‌కు సన్మానం



**ముద్ర, కూకట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్, వైస్ చైర్మన్ పరుచూరి మురళిలకు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో 'స్పీక్' (సొసైటీ ఫర్ పొలిటికల్ ఎంపవర్మెంట్ విత్ యాక్షనబుల్ నాలెడ్జ్) సంస్థ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు.అన్నే సత్య నారాయణ, డాక్టర్ గోపాలం విద్యాసాగర్, అట్టేపల్లి రామప్రభు నేతృత్వంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమానికి కమ్మ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు శాలువాలు కప్పి, పూలమాలలతో అభినందనలు తెలియజేశారు.నాయకులు మాట్లాడుతూ, నూతనంగా ఏర్పాటైన ఈ కార్పొరేషన్ ద్వారా సమాజంలోని పేదవారికి ప్రభుత్వ పథకాలు సకాలంలో అందుతాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చైర్మన్ తగు చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మురళీకృష్ణ, సాయిబాబా చౌదరి, తూము వినయ్, దోనేపూడి చక్రపాణి, వాసిరెడ్డి నరేష్, మన్నె నాగమల్లేశ్వరి, చిట్టి వీరయ్య, రమేష్, విజయ సారధి పాల్గొన్నారు. అలాగే తార్నాక కమ్మ సంఘం సభ్యులు డాక్టర్ హరి చౌదరి, కొణిదల లక్ష్మీనారాయణ, ఉపేంద్ర, మల్లిబాబు, వీరబాబు, వాసు తదితరులు పాల్గొని నూతన కమిటీకి తమ మద్దతును ప్రకటించారు.

## భార్య గొంతు కోసి చంపిన భర్త



**ముద్ర, కూకట్‌పల్లి:** కుటుంబ కలహాల కారణంగా ఓ భర్త తన భార్యను దారుణంగా హత్య చేసిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు మరియు మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారంఎల్లమ్మబండలోని కేటీఆర్ కాలనీకి చెందిన సుమేరా బేగం (23)కు బోరబండకు చెందిన షేక్ రహీమ్‌తో జనవరి 2024లో వివాహమైంది. పెళ్లయినప్పటి నుండి ఈ దంపతులు కూకట్‌పల్లి కైత్లాపూర్‌లోని ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నారు. అయితే, వివాహం జరిగిన నాటి నుండి వీరి మధ్య కుటుంబ విషయాలపై నిరంతరం గొడవలు జరుగుతుండేవి. పెద్దల సమక్షంలో పలుమార్లు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ రహీమ్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు.ఈ క్రమంలోనే గురువారం ఉదయం దంపతుల మధ్య తీవ్రమైన వాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి లోనైన షేక్ రహీమ్ ఇంట్లో ఉన్న కత్తితో సుమేరా బేగం గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. గమనించిన స్థానికులు వెంటనే కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న మృతురాలి సోదరి అస్మా అంజుమ్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని, తన చెల్లెలిని భర్తే కావాలని ప్లాన్ ప్రకారం హత్య చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు షేక్ రహీమ్‌ను ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గోవాలో అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

### రూ.82 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం



**ముద్ర, మల్కాజిగిరి:** సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఇంటి చోరీ కేసును పోలీసులు ఛేదించి అంతర్రాష్ట్ర దొంగను గోవాలో అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.82 లక్షల విలువైన 576 గ్రాముల బంగారు ఆభరణాలు, ఫైన్ గోల్డ్‌తో పాటు 900 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ తెలిపారుమే 27న సికింద్రాబాద్ పోట్ మార్కెట్‌కు చెందిన ఓ ఇంట్లో తాళాలు పగులగొట్టి బంగారం, వెండి చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రత్యేక బృందాన్ని గోవాకు పంపారు. జూన్ 1న ఉత్తర గోవాలో నిందితుడు మనోజ్ సింగ్ (28), ఢిల్లీకి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం నిందితుడు ఢిల్లీలో 19 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉండగా, పలు కేసుల్లో నాన్–బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసును ఏసీపీ వి. యాదగిరి రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వి. రాంచందర్ పర్యవేక్షణలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎం. బషీర్ అహ్మద్, ఎస్ఐలు నరేష్, రవి తదితరులు ఛేదించారు.

## ఓవర్ స్పీడ్ కారు ఢీకొట్టడంతో ఆవు ఎద్దు మృతి

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని చంద్రకల్ – నక్కలపల్లి గేట్ మధ్య గురువారం వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొనడంతో చంద్రకల్ గ్రామానికి చెందిన గంగపురి చిన్నయ్యకు చెందిన ఆవు, ఎద్దు మృతి చెందాయి. ప్రమాద విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావుతో పాటు గ్రామ పెద్దలు ఘటనపై ఆరా తీసి బాధిత రైతుకు తగిన న్యాయం చేయాలని కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. బాధిత రైతుకు నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 05.06.2026
www.mudranews.in | @mudranews



### టీ-సిగరెట్ లను ఖాళీ కడుపుతో తీసుకుంటే జీర్ణ సమస్యలు

టీ, సిగరెట్ల కలయిక కడుపులో యాసిడ్ ఉత్పత్తిని పెంచుతుంది. ఎసిడిటీ, గ్యాస్, గుండెల్లో మంట వంటి సమస్యలు తరచుగా వేధిస్తాయి.



# మ్యూల్ అకౌంట్స్ తో సైబర్ నేరాలు

- సైబర్ నిందితులకు సహకరిస్తున్న ఐదుగురు అరెస్టు
- రూ.8.18 కోట్ల లావాదేవీలు
- రెండేళ్లుగా తతంగం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** కష్టపడకుండా డబ్బు సంపాదించాలన్న ఆశతో తమ బ్యాంకు ఖాతాలు సైబర్ నేరగాళ్లకు ఇచ్చి సహకరించిన ఐదుగురిని నిర్మల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో రూ. 8.18 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఎస్పీ జానకి షర్మిల మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని లోకేశ్వరం, సోన్ మండలాలకు చెందిన ఐదుగురిలో లోకేశ్వరం మండలానికి చెందిన ముగ్గురు
నిమ్మ గజేందర్, మగ్గిడి నవీన్, మగ్గిడి మహేందర్ లు ఇప్పటికే అరెస్టయ్యారు. సోన్ మండలానికి చెందిన మేకల నిఖిల్, షికారి సాయి క్రిష్ణపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. నిందితులు 2024 నుంచి తమ పేర్లతో, వ్యాపార సంస్థల పేర్లతో వివిధ బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు ప్రారంభించి వాటి వివరాలను సైబర్ నేర ముఠాలకు అందజేశారు. ఆ ముఠా ఆన్‌లైన్ మోసాలతో డబ్బును ఈ ఖాతాల ద్వారా లావాదేవీలు జరిపారు. ఇందుకు ప్రతిఫలంగా నిందితులకు కమీషన్లు అందాయి. వీరిలో నిమ్మ గజేందర్‌పై 9, మగ్గిడి నవీన్‌పై 28, మగ్గిడి మహేందర్‌పై 5, మేకల నిఖిల్‌పై 16, షికారి సాయి కృష్ణపై 6 సైబర్ ఫిర్యాదులు ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో నమోదయ్యాయి. నిమ్మ గజేందర్‌కు చెందిన ఆర్ వి ట్రేడర్ ద్వారా రూ.2.69 కోట్లు, మగ్గిడి నవీన్ కు చెందిన అజాన్ ట్రేడర్స్ ద్వారా సుమారు రూ.2.11 కోట్లు, మగ్గిడి మహేందర్ ఎన్ ఆర్ ట్రేడర్స్ ద్వారా సుమారు రూ. 91.36 లక్షలు, మేకల నిఖిల్‌కు చెందిన హెచ్ ఆర్ ఆటోమొబైల్స్ ద్వారా రూ.1.18 కోట్లు, షికారి సాయి కృష్ణకు చెందిన హెచ్ ఎన్ ఎంటర్ ప్రైజెస్ ద్వారా రూ1.28 కోట్ల లావాదేవీలు, రూ.3.84 కోట్లకు పైగా నగదు చలామణి జరిగినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డబ్బు ఆశతో తమ బ్యాంకు వివరాలను ఇతరులకు అప్పగించవద్దని హెచ్చరించారు. ఈ కేసులో కృషి చేసిన భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ముధోల్ ఇన్స్పెక్టర్ రవీందర్ నాయక్, సోన్ ఇన్స్పెక్టర్ గోవర్ధన్ రెడ్డి, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ వెంకట రమణ,ఎస్ఐ లు గోపి, అశోక్, సిబ్బందిని అభినందించారు.




## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

- మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలి.....
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్....



**ముద్ర, కోరుట్ల;** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా కథలాపూర్ మండలం కలికోట గ్రామంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొను గోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుం డా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదే విధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాల ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారు లను ఆదేశించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరే లా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పరిశీలనలో కోరుట్ల ఆర్.డి.వో జివాకర్ రెడ్డి, డి.టి.ఓ సంధాని, డి.సీ. ఎస్.ఓ. జితేం దర్ రెడ్డి, తహసిల్దార్ రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణా అభివృద్ధికి కేంద్రం భారీ కానుక



నరేంద్ర మోడీ, ధర్మపురి అర్వింద్ చిత్ర పటాలకు పాలాభిషేకం.....

**ముద్ర, కోరుట్ల;** బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అనూప్ రావు ఆదేశాల మేరకు కోరుట్ల బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గురువారం రోజు స్థానిక కొత్త బస్టాండ్ చౌరస్తా వద్ద నరేంద్ర మోడీ, నితిన్ గడ్కరి, ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్మూర్–జగిత్యాల–కరీంనగర్ ఎన్ హెచ్ 63 నాలుగు లైన్ల విస్తరణకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఉత్తర తెలం గాణకు 1090 కిలోమీటర్ల జాతీయ రహదారుల అభివృద్ధికి, 7597 కోట్లు మంజూరు చేసిన సందర్భంగా కోరుట్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. నిజామాబాద్ నుండి జగిత్యాల వరకు మన పార్లమెంటు 4 లైన్ల రోడ్డు విస్తరణకు, అలాగే అభివృద్ధి పనులకు సహకరిస్తున్న ధర్మపురి అరవింద్కి కృతజ్ఞతలు తెలియజేశారు. బీజేపీ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిలు చెట్లపల్లి సాగర్, ఎర్ర రాజేందర్, మ్యాకల గణేష్, జిల్లా నాయకులు సుదవేణి మహేష్, గిన్నెల శ్రీకాంత్, తులసి కృష్ణ, నాగరాజ్, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం చెల్లింది

బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** తెలంగాణా లో కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, రాబోయే ది బీజేపీ ప్రభుత్వమేనని బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం నిర్వహించిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బిజెపికి అనుకూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త అంకితభావంతో ప్రజాక్షేత్రంలో పనిచేయాలన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా కలిసి కృషి చేస్తే తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయశ్రీ, రావుల రాంనాథ్, మేడిశెమ్మె రాజు, యాతాళం చిన్నారెడ్డి, నల్లా రవీందర్ రెడ్డి, కరిపే విలాస్ గారు, సత్యం చంద్రకాంత్ , బుర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాటరీల దొంగతనాల కేసును చేయించిన పోలీసులు

దొంగలను పట్టుకుని రిమాండ్ కు తరలింపు...

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** గత కొన్ని నెలలుగా గ్రామపంచాయతీల్లో దొంగతనాలకు గురవుతున్న బ్యాటరీల కేసును జగిత్యాల రూరల్ పోలీసులు చేదించారు. ఈ మేరకు నీకు చాలా రోజుల పోలీస్ స్టేషన్లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు సిఐ సుధాకర్ వివరించారు. జగిత్యాల రూరల్ మండలం పరిధిలోని ధరూర్ గ్రామ శివారులో నిర్వహించిన వాహనాల తనిఖీల నేపథ్యంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా బ్యాటరీ లభించాయి. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురిని పట్టుకొని విచారించగా బ్యాటరీ దొంగతనాలకు పాల్పడినట్లు బయటపడిందని అన్నారు. నిందితుల నుంచి 39 డ్రై బ్యాటరీలు, 4 యూపిఎస్ పవర్ సప్లయర్లను, బజాజ్ ప్యాసింజర్ ఆటో స్వాదీనం చేసుకున్నట్టు పట్టుకున్న వస్తువుల విలువ సుమారు రూ. 4.52లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. నిందితులు లక్ష్మిపూర్ కు చెందిన బండ అంజయ్య, మండలి రవి, చెమేల్ల నరేష్ లను అరెస్టు చేసి రిమాండ్ కు పంపిస్తున్నట్టు తెలిపారు.




## భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదు

- సందేహాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 4788
- వాట్స్ యాప్ నెంబర్ 8247619983
- రాష్ట్ర రెవెన్యూ శాఖ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గచ్చిబౌలిలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేసిన మంత్రి, గత ప్రభుత్వం వాటిని 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందని గుర్తు చేశారు. ప్రజలపై అదనపు భారం పడకుండా శాస్త్రీయ విధానంలో భూముల విలువలను సవరించామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎకరానికి కనీస విలువ రూ.2.75 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్లలో రూ.5 లక్షలు, హెచ్ఎండీఏ పరిధిలో రూ.10 లక్షలు, ఓఆర్ఆర్ పరిధిలో రూ.15 లక్షలుగా నిర్ణయించినట్లు వెల్లడించారు.

రెవెన్యూ శాఖలో అవినీతిని అరికట్టేందుకు సబ్ రిజిస్ట్రార్ల అధికారాలను కుదించామని, భూములకు సంబంధించిన అన్ని పత్రాలను డిజిటలైజ్ చేయనున్నట్లు తెలిపారు. ఫిర్యాదులు, సందేహాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 599 4788, వాట్సాప్ నంబర్ 8247619983 అందుబాటులో ఉన్నాయని చెప్పారు.



ఇప్పటికే దాదాపు 3,500 పెండింగ్ ఫైళ్లను పరిష్కరించామని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును రద్దు చేసే అవకాశం లేదని, ప్రజలకు ఆధునిక సేవలు అందించేందుకు సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. మొదటి విడతలో ఓఆర్ఆర్ పరిధిలో 39 కార్యాలయాలను 13 క్లస్టర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ నాటికి గచ్చిబౌలి ఇంటిగ్రేటెడ్ భవనం అందుబాటులోకి వస్తుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## ఆకట్టుకున్న రామక్రిష్ణ కళాశాలల వీడ్కోలు వేడుకలు



**ముద్ర, కోరుట్ల;** స్థానిక రామక్రిష్ణ డిగ్రీ, పిజి కళాశాల లో మొదటి మరియు రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మూడవ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు "అడియోస్–2026" ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆర్కె గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్, కరస్పాండెంట్ యాద రామకృష్ణ లు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల యొక్క ఆశయాలను నెరవేర్చే విధంగా జీవితంలో ముందుకు సాగాలని పేర్కొన్నారు. కళాశాలలో అధ్యాపకులుగా బోధించి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించిన లింగాల లక్ష్మణ్, పుల్ల సాయి గౌడ్, మామిడిపల్లి రామకృష్ణ, జే. రంజిత్ ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ లో జేఏవోగా ఉద్యోగం సాధించిన కైరం కొండ ప్రసాద్ విశిష్ట అతిథులుగా పాల్గొని విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హరిప్రియ అంజయ్య గౌడ్, ప్రిన్సిపాల్ బెజ్జారపు ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నే నాణ్యమైన విద్య...

జిల్లా విద్యాధికారి రాము...




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని వారి సేవల ద్వారానే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా అందుతుందని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. జగిత్యాల జిల్లా భీమారం మండలంలోని రంగాపూర్ లో ఈనెల 3 నుండి 18 వరకు జరుగుచున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలతో జరిగిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తో పాటు ఈ విద్యా సంవత్సరం ఉదయం అల్పాహారం అందించడం జరుగుతుందని, అదేవిధంగా 9 రకాల వస్తువులతో కూడిన కిట్లు కూడా అందించబడతాయని అన్నారు. జిల్లా ఈ సంవత్సరం కొత్తగా 26 ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభిస్తున్నామని, అలాగే ఈ సంవత్సరం బాసర త్రిబుల్ ఐటీ లో 126 మంది విద్యార్థులకు సీట్లు సాధించడం జరిగిందని తెలిపారు. నేడు సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వారందరూ ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారేనని వారన్నారు అందుకని గ్రామ ప్రజలు అందరు సహకరించి విద్యార్థులందరిని ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మకిలి కావేరి కుమార్, మండల విద్యాధికారి మధుసూదన్ రెడ్డి, పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి, ఉప సర్పంచ్ బోయిని పెల్లి రాంమోహన్ రావు, మేడిపల్లి మండల విద్యాధికారి లక్ష్మి నరసయ్య, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ వెంకట్ రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వప్న, సిఆర్పి బర్ల నారాయణ, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కొడిమ్యాల ఫారెస్ట్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

రూ.80 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ ఎఫ్ఆర్ఓ....

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల ఫారెస్ట్ కార్యాలయం పై ఏసీబీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.80 వేల లంచం తీసుకుంటుండగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) మొయినొద్దీన్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు పక్కా ప్రణాళికతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ACB DSP విజయ్ కుమార్ బృందం ఆధ్వర్యంలో వల పన్నిన ఏసీబీ అధికారులు, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే అధికారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో కొడిమ్యాల ఫారెస్ట్ శాఖలో కలకలం రేగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## దొంగతనానికి పాల్పడుతున్న భార్యాభర్తల అరెస్ట్, రిమాండ్

20 గ్రాముల బంగారం,1 కేజీ 250 గ్రాముల వెండి స్వాధీనం....




**ముద్ర, కోరుట్ల;** జగిత్యాల జిల్లా మెట్పల్లి సర్కిల్ పరిధిలోనీ మెట్పల్లి, ఇబ్రహీం పట్నం, మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లోనీ దేవాలయాలలో వరుస దొంగతనాలు జరుగుతుండగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్పల్లి డిఎస్పి రాములు ఆధ్వర్యంలో సిఐ బి. సురేష్ బాబు నేతృత్వంలో మెట్పల్లి ఎస్సై కిరణ్ కుమార్, మల్లాపూర్ ఎస్సై అనిల్, ఇబ్రహీంపట్నం ఎస్సై జి నవీన్ కుమార్ ఐడి పార్టీ కానిస్టేబుళ్లు విశాల్, కిరణ్, ప్రణయ్ లతో కలిసి గాలిస్తుండగా, సిసి ఫుటేజ్ ఆధారంగా వారిని గుర్తించారు. వెల్లుల్ల గ్రామానికి చెందిన ఆరే శంకర్ 50, అతని భార్య ఆరే అనూష 45 మరి కొందరు కలిసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని బండలింగాపూర్, వర్షకొండ తిమ్మాపూర్ వేముల కుర్తి, మెట్పల్లి మండలం ఆత్మకూరు, వేంపేట మల్లాపూర్ మండలంలోని సిర్పూర్ రాఘవపేట కథలాపూర్ మండలంలోని ఊట్పల్లి గ్రామంలో పలు దేవాలయాలలో దొంగతనానికి పాల్పడ్డారు. మొత్తంగా 8 కేసులలో నిందితులుగా ఉన్న వీరిని నమ్మకదగిన సమాచారం మేరకు నిందితుల ను పట్టుకొని విచారించగా దొంగతనం చేసినట్లుగా ఒప్పుకోగా, వారి వద్ద నుండి దొంగ సొత్తు 20గ్రాముల బంగారం,1.250 కేజీల వెండిని స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు మెట్పల్లి సీఐ సురేష్ బాబు వెల్లడించారు..

## ధాన్యం అన్ లోడింగ్ లో ఆలస్యం వద్దు



**మహాదేవపూర్, ముద్ర:** ధాన్యం దిగుమతి సమయంలో ఎలాంటి ఆలస్యం జరుగకుండా సక్రమంగా నిర్వహించేందుకు సంబంధిత ఇన్‌చార్జ్‌లకు అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ దిశానిర్దేశం చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం తూకం, నిల్వ రవాణా ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ గురువారం కాటారం మండలంలోని ఏఎంసి గోదాం, రుద్ర కాటన్ మిల్లు మరియు మీనాక్షి జిన్నింగ్ మిల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎం రాములు పాల్గొన్నారు.

## టీ-సిగరెట్ కాంబోతో..



మెదడును వ్యసనానికి బానిస చేస్తుంది. నికోటిన్, కెఫీన్ కలిసి డోపమైన్ విడుదల చేసి తాత్కాలిక ఆనందాన్ని కలిగిస్తాయి. దీంతో ఒత్తిడి తగ్గాలంటే టీతో పాటు సిగరెట్ కావాలనే భావన బలపడుతుంది.

# బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచాలి

**ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలను అత్యున్నత ప్రమాణాలతో అందించాలని, మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు లేకుండా నిరంతరాయంగా సేవలు అందేలా చూడాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అధికారులను ఆదేశించారు.గురువారం హైదరాబాద్ లోని తన నివాసంలో టెలికాం విభాగం ఏపీఎల్ఎస్ఏ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ భాస్కరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ జి. గణేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.లక్ష్మణ కుమార్, బిఎస్ఎన్ఎల్ హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సి. రమణలతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర టెలికాం కార్యదర్శిని కలిసి ఉభయ జిల్లాల్లో ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్యను అధిగమించడానికి 25 నూతన టవర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు గుర్తు చేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు, సరిహద్దు గ్రామాల్లో ఫోన్, ఇంటర్నెట్ సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను గుర్తించి, సత్వరం చర్యలు తీసుకోవాలని ఎంపీ ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రస్తుత స్థితిగతులు, సాంకేతిక అంశాలను ఎంపీకి వివరించారు.

# రైతులకు అందుబాటులో జీలుగు విత్తనాలు



**ముద్ర, తుంగతుర్తి:** రైతులకు అందుబాటులో జీలుగు విత్తనాలు ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, ఏడీఏ రమేష్ బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ది రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో రైతులకు జీలుగు విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. 30 కేజీల బస్తా రూ.4,950 ఉండగా 50 శాతం సబ్సిడీతో రూ.2,453కు అందిస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ను తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో యాదగిరి, రైతులు మాధవరావు, దేవేందర్ రావు, కాసం మల్లయ్య, యూసుబ్, బిక్షం, లింగయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారికి న్యాయం చేయాలి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చెయ్యి కోల్పోయిన చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పి ఓ డబ్ల్యు ,పి వై ఎల్ ఆధ్వర్యంలోడిఆర్ఓ కి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వి రాకేష్ మాట్లాడుతూ వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన తలపాటి రేణుకకు ఇద్దరు కవల పిల్లలు జన్మించారు వారిలో ఒక బాబుకు గవర్నమెంట్ హాస్పిటల్ లో వైద్యం చేశారు అక్కడ ఒక బాబుకు వైద్యుల నిర్లక్ష్యం వలన చేతికి ఇన్ఫెక్షన్ వచ్చి హైదరాబాదులో చెయ్యి తొలగించారని ఇది అత్యంత బాధాకరమన విషయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు .వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వలన చిన్నారి జీవితాంతం వికలాంగుడిగా జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు .అదేవిధంగా ఆ బాబుకు నష్టపరిహారం 50 లక్షలు ఇవ్వాలని, విద్య ,వైద్యం, ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ హాస్పిటల్ పై ప్రజలకు నమ్మకం కలిగించే లాగా ఉండాలని ,ప్రభుత్వ హాస్పటల్ ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని వారు సూచించారు.ఒక పసి బాలుడు ఇంత దారుణమైన ఘటన జరిగితే జిల్లా మంత్రులు గాని, అధికారులు గాని మాట్లాడకపోవడం శోచనీయమని వారన్నారు. ప్రభుత్వ హాస్పిటల్లో ఇటువంటి ఘటనలు జరుగుతుంటే ప్రజలకు ప్రభుత్వ హాస్పిటల్స్ మీద ఉన్న నమ్మకం పోతుందని వారు ఆరోపించారు . ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని వారి కోరారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షులు ఝాన్సీ, జిల్లా సహాయ కార్యదర్శి శోభ, పి వై ఎల్ జిల్లా కార్యదర్శి జె భరత్, పివైఎల్ జిల్లా నాయకులు జి అశోక్, ఆవుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలి

**–మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్**




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రభుత్వ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని 12, 13లలో వార్డులలో మున్సిపల్ కమిషనర్ కే.చంద్ర ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు తోటకూర విజయలక్ష్మి వెంకటేష్, గుర్రాల సంతోష శ్రీనివాస్ ల అధ్యక్షతన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమంలో చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముగింపు సభలలో పట్టణ ప్రజలకు సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ రూల్స్, 2026, జల్ సంచయ్ – జల్ భగీరత పథకం క్రింద ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుట, మురికి కాలువల శుభ్రం చేయుట, పూడిక తీయు పనులు, వర్షాకాల సంసిద్ధత పై కార్యాచరణ ప్రణాళిక, మంచి నీటి సరఫరా నిర్వహణ, నీరు నిలువ ప్రాంతాల నివారణ, పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ, వీధి దీపాలు, మొక్కలు, పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలు ఫిర్యాదుల పరిష్కారం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. నాలుగు రోజులలో షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు 10 వార్డుల చొప్పున, చివరి రోజున 5 వార్డులలో వార్డు సభలు నిర్వహించవబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, మహిళా సంఘాల వారు, వార్డు ప్రజలు,సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా తిరుప్పావడ సేవ



కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో తిరుప్పావడ సేవ గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంది. అప్పడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని లడ్డు, వడ తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు. వేదమంత్రోచ్చారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు.సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోప్పృష్ట దర్శనాన్ని భక్తులకు కల్పించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. – ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

# స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం అని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లా మహిళా సమాఖ్య ప్రత్యేక సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా పరిశ్రమల కేంద్రం, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ), ప్రధాన బ్యాంకర్ల సమన్వయ శాఖకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత, జీవనోపాధి అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ వినియోగంపై విస్తృతంగా చర్చించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న రుణాలు, సబ్సిడీలు, శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు, మార్కెటింగ్ సదుపాయాలు, ఇతర ప్రోత్సాహక పథకాల వివరాలను మహిళా సంఘాల సభ్యులకు తెలియజేశారు. మహిళా సంఘాలు సంప్రదాయ వృత్తులకు మాత్రమే పరిమితం కాకుండా ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సూచించారు. ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్, డిజిటల్ సేవలు, సూక్ష్మ పరిశ్రమలు, పర్యావరణ హిత ఉత్పత్తుల తయారీ, సేవా రంగం, ఇతర ఆదాయ వనరులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.మహిళా సంఘాలకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖలలో అమలవుతున్న అన్ని పథకాల సమాచారాన్ని ఒక సమగ్ర పుస్తక రూపంలో రూపొందించి అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు.ఈ పుస్తకం ద్వారా మహిళలు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన పొందడంతో పాటు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.అదే విధంగా మహిళా సంఘాల అభివృద్ధి, జీవనోపాధి కార్యక్రమాల పురోగతి, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంపొందించి మహిళా సంఘాలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశం ద్వారా మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, ప్రభుత్వ పథకాల సమర్థ వినియోగానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఎల్ డిఎం వీరన్న ,ఏ డి జిల్లా పరిశ్రమల అధికారి రవీందర్, వ్యవసాయ అధికారి రమణారెడ్డి, హార్టికల్చర్ అధికారి హేమలత ,జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కందుకూరి రేణుక, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి రచ్చ పల్లవి, కోశాధికారి అలివేలు, జిల్లాలోని అన్ని మండల మహిళా సమాఖ్యల అధ్యక్షులు, ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

# విద్యాశాఖను ప్రథమ స్థానంలో ఉంచాలి

**జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లా విద్యాశాఖను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంచడం కోసం మండల విద్యాధికారులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేసి, విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. బడిబాటలో ప్రతి రోజు రాష్ట్ర విద్యా శాఖ ఇచ్చిన షెడ్యూలు ప్రకారం వివిధ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. బడి తెరిచే నాటికి పాఠశాల పారిశుధ్య కార్మికుల సేవలు వినియోగించుకొని, జూన్ 12 పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభం అయ్యేలా చూడాలని కోరారు. ఈ విద్యా సంవత్సరం ప్రత్యేకంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, చైర్మన్లు అయిన మహిళా సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో ఒక ఉద్యమ స్ఫూర్తితో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న బడి ఈడు పిల్లలను 100 శాతం ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలన్నారు. జిల్లాలో నూతనంగా 62 ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభిస్తున్నామని, వాటిలో కనీసం 20 మంది విద్యార్థులకు తగ్గకుండా చేర్పించాలని కోరారు. ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించడం తెలియ చేయాలన్నారు. ఈ సమావేశంలో సెక్టోరియల్ అధికారులు పెసరు లింగారెడ్డి, శ్రీహరి అయ్యంగార్, జానీ ఆఫ్ఘన్, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# కవిత వ్యాఖ్యలపై తెలుగు మహిళల నిరసన



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఇటీవల హైదరాబాద్ రౌండ్ టేబుల్ సమావేశంలో కల్వకుంట్ల కవిత ఎన్టీఆర్ విగ్రహం పై చేసిన వ్యాఖ్యలకు ఖండిస్తూ టీడీపీ జిల్లా కార్యాలయంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్లో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అన్నగారి విగ్రహానికి పాలాభిషేకం చేశారు, అనంతరం తెలుగు మహిళ రాష్ట్ర నాయకురాలు చుండూరు రాజరాజేశ్వరి మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఎన్టీఆర్ విగ్రహం కూల్చి ఆంధ్రకు పంపిస్తామని కవిత చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని వెంటనే వెనక్కు తీసుకోవాలని హెచ్చరించారు. నీ తండ్రి కేసీఆర్ కు రాజకీయ బిక్ష పెట్టింది ఎవరో తెలుసుకోని మాట్లాడాలని, ఎన్టీఆర్ పేరు నీ అన్నకు ఎందుకు పెట్టారో తమ తండ్రిని అడుగలన్నారు. కవిత సంగతేందో తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలియదా బతుకమ్మ ఆడుతూ అందరి దృష్టి మరల్చి 200 కోట్లతో మద్యాన్ని ఢిల్లీ, బీహార్, దాక మోసకపోయి తెలుగు ఆడపడుచుల గౌరవం తీసి ఒక మహిళ చేయకూడని మద్యం కుంభకోణం చేసి జైలు పాలై తెలంగాణ రాష్ట్రా ప్రజల సంపద దోచి వాటి పంపకాల్లో కుటుంబ విభేదాలు తలెత్తి వేరే పార్టీ పెట్టిన నీవు వార్డు మెంబర్ గా గెలవలేని నీవు సీఎం అయితావా అని ప్రశ్నించారు. తిన్నింటి వాసాలు లెక్క పెట్టే మీ కుటుంబ పార్టీలు ఇలాంటి వ్యాఖ్యలతో భూస్తాపితం అవడం ఖాయం అని అన్నారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకుంటే తెలంగాణలో తిరగనివ్వం ఖబడ్దార్ అని అన్నారు. కార్యక్రమంలో మేకల సత్యవతి, మందపల్లి రజిని, కోనేరు రాణి, తాడిశెట్టి స్వాతి, సౌలం లావణ్య, వలగపూడి విజయలక్ష్మి, రంగిశెట్టి మంగమ్మ, మట్టరీ రాణి, మేడిపల్లి రమాదేవి, బేబీ వైదేహి తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్లను మోసం చేస్తున్న ప్రభుత్వం

**ఎన్.పి.ఆర్.డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో 2 లక్షల మందికి చేయూత పెన్షన్స్ మంజూరు చేస్తామని ప్రకటించి, జూన్ 2 న ఎందుకు పెన్షన్స్ మంజూరు చేయలేదని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య ప్రశ్నించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు టి వరమ్మ, కోశాధికారి ఆర్.వెంకటేష్, ఉపాధ్యక్షులు వి.ఉపేందర్, సహాయ కార్యదర్శి యేశాల గంగాధర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి శశికల లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ 2023 డిసెంబర్ నెలలో జరిగిన ప్రజాపాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న 11రకాల చేయూత పెన్షన్స్ కోసం 24.85 లక్షల మంది దరఖాస్తూ చేసుకున్నారని ప్రభుత్వం గతంలో ప్రకటించింది అధికారంలోకి వచ్చి 30 నెలలు అవుతుంది. దరఖాస్తులు చేసిన లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయా చుట్టూ తిరుగుతున్న స్పందించడం లేదన్నారు. 2026 ఫిబ్రవరి నెలలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కొత్తగా 2 లక్షల మందికి చేయూత పెన్షన్స్ జూన్ 2 నాడు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రకటన వలన లక్షలాది మంది చేయూత పెన్షన్స్ కోసం దరఖాస్తులు చేసుకునేందుకు మీ సేవా కార్యాలయల నుండి సర్టిఫికెట్స్ తీసుకుని దరఖాస్తూ చేసుకున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 నాడు అమలు చేస్తామని చెప్పిన కొత్త పెన్షన్స్ ఎందుకు మంజూరు చేయలేదు.ముఖ్యమంత్రి, మంత్రులు జిల్లాలో అనేక మీటింగ్లలో జూన్ 2న 2 లక్షల మందికి పెన్షన్స్ మంజూరు చేస్తామని ప్రగల్బాలు పలికి చేతులు ఎత్తివేయడం ఎంత వరకు సమంజసం. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తూ పరిపాలన చేయాలనుకోవడం సిగ్గుచేటు.ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కోసం చర్యలు తీసుకోవాలని లేని యెడల ఉద్యమం తప్పధు.రాష్ట్ర ముఖ్యమంత్రి కొత్త పెన్షన్స్ పంపిణి కోసం వెంటనే తేదీని ప్రకటించాలని డిమాండ్ చేస్తుంది.లేని యెడల జిల్లాలో మంత్రుల పర్యటనలను అడ్డుకోవాలని చేయూత లబ్ధిదారులకు పిలుపునిచ్చారు.

# ప్రజాపాలనతో గ్రామాల అభివృద్ధికి బాటలు

**మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికతో గ్రామాల అభివృద్ధికి తోడ్పడతాయని మండల ప్రత్యేక అధికారి జినుకల శ్యాంసుందర్ అన్నారు. గురువారం మండలంలోని అనంతారం , తాజ్పూర్, హన్మాపూర్, మన్నె వారి పంపు, వడపర్తి, బిన్ తిమ్మాపూర్, బస్వాపూర్, ముత్తిరెడ్డిగూడెం, గంగసానిపల్లి గ్రామాలలో ముగింపు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా పాలనలో జరిగిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలపై ప్రజలకు ఆయా గ్రామాల సర్పంచులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి శోభ రాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఎంపీడీవో దినకర్, ఏపీఓ బాలస్వామి, ఏపీఎం మల్లేష్ ఇతర మండల అధికారులు, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# నృసింహుని హుండీ ఆదాయం రూ.3.18 కోట్లు



**ముద్ర, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీలను గురువారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఎస్పీఎఫ్ హోంగార్డుల భద్రత నడుమ స్వామి వారి హుండీలను కొండకింద సత్యనారాయణ స్వామి మండపంలోకి తరలించి ఈవో భవాని శంకర్ పర్యవేక్షణలో లకౌంటింగ్ చేపట్టారు. భక్తుల చేత 30 రోజుల హుండీ ఆదాయం రూ.3,18,37,261, రూపాయలు వచ్చాయి. స్వామివారికి మిశ్రమ బంగారం 179 గ్రాములు, మిశ్రమ వెండి 3 కిలోలు విదేశీ కరెన్సీ అమెరికా502 డాలర్లు, ఆస్ట్రేలియా 75 డాలర్లు, ఇంగ్లాండ్ 5 పౌండ్స్, యూఏఈ 95 దిరమ్స్, నేపాల్ 100 రుపీస్, కెనడా 130 డాలర్స్, సౌదీ అరేబియన్5 యూరప్ 10 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 05.06.2026
www.mudranews.in | @mudranews



### టీ-సిగరెట్ కాంబోకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోండి

టీ-సిగరెట్‌కు బదులుగా నీరు తాగడం, చిన్నపాటి నడక చేయడం మంచిది. యోగా, ధ్యానం వంటి అలవాట్లు ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యాన్ని కాపాడతాయి.



### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, గ్రామాభివృద్ధికి

# ప్రజలే కేంద్రబిందువు

**రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్...**



**ముద్ర, కోరుట్ల :** ప్రజల అవసరాలు, గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యక్షంగా ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామంలో గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించబడింది. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి ఈ గ్రామసభలో పాల్గొన్నారు. గ్రామ ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి నేరుగా సూచనలు, అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం మరియు ఇతర మౌలిక వసతులకు సంబంధించిన అంశాలపై చర్చించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు వేగవంతమైన పరిష్కారాల కోసం సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. విప్ వెంట మార్కెట్ చైర్మన్ మాదం వినోద్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి, భీమారం మండలాధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, సర్పంచ్ గుయ్య అంజన్న, ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి, ప్రణయ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయవంతంగా సమ్మర్ క్యాంపులు

**డి వై ఎస్ ఓ వీర రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** గత నెల రోజుల నుండి సిద్దిపేట జిల్లా రూరల్, అర్బన్ మండలాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్రీడా క్యాంపులు విజయ వంతంగా నడుస్తున్నాయని సిద్దిపేట నూతన క్రీడాశాఖధికారి వీరారెడ్డి తెలిపారు. ఆయన నియామకం పై సిద్దిపేట ఫుట్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్బర్ నవాబ్, సంయుక్త కార్యదర్శి సాజిద్ లో గురువారం డి వై ఎస్ ఓ కు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అందరి సహాకారంతో క్రీడాలను ప్రోత్సాహం కల్పిద్దామని అన్నారు. తనను డి వై ఎస్ ఓ గా నియమించిన సాట్ ఎండి జిల్లా కలెక్టర్ హైమావతి కి కృతజ్ఞతలు తెలిపారు.

### పర్యావరణ పరిరక్షణలో విశిష్ట సేవలకు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేటకు గుర్తింపు పత్రం

**ముద్ర ప్రతినిధి,సిద్దిపేట:** పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి, స్థిరమైన క్యాంపస్ నిర్మాణంలో విశేష కృషి చేసినందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), సిద్దిపేట కు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ (సీజీఆర్) సంస్థ ప్రతిష్ఠాత్మక "సర్టిఫికేట్ ఆఫ్ రికగ్నిషన్" ను ప్రదానం చేసింది. ఈ గుర్తింపు పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అయోధ్యా రెడ్డి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ అధ్యక్షురాలు శ్రీమతి కె. లీలా లక్ష్మా రెడ్డి ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు డా. డి.ఎస్.ఎస్.ఆర్. రాజేందర్ సింగ్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో చేపట్టిన హరితహారం, జీవ వైవిధ్య పరిరక్షణ, వర్మీ కంపోస్టింగ్, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, పర్యావరణ అవగాహన కార్యక్రమాలు పచ్చదనాన్ని పెంపొందించే అనేక కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో కళాశాల ఎర్త్. సెంటర్ ప్రదర్శిస్తున్న చొరవను అభినందించి, అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది సమిష్టి కృషి వల్ల కళాశాల ఆదర్శ హరిత విద్యాసంస్థగా నిలుస్తోందని పేర్కొన్నారు.

ఈ గుర్తింపు కళాశాలకు మరింత ప్రేరణనిచ్చే అంశమని, భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సునీత వెల్లడించింది.ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి. సునీత ప్రత్యేకంగా కళాశాల ఎర్త్ సెంటర్ కన్వీనర్, జంతుశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పి. అయోధ్యా రెడ్డి ని జంతుశాస్త్ర విభాగ అధ్యాపక బృందాన్ని, ఎకోక్లబ్ సభ్యులను అభినందించారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ, వర్మీ కంపోస్టింగ్, హరిత క్యాంపస్ అభివృద్ధి తదితర అంశాలలో వారు చేపట్టిన వినూత్న, పర్యావరణ హిత కార్యక్రమాలు కళాశాలకు ఈ గుర్తింపు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాయని ఆమె పేర్కొన్నారు. కళాశాల ఎర్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యతను పెంపొందించడంలో విశేషంగా దోహదపడ్డాయని ఆమె కొనియాడారు.అభినందించిన వారిలో ఐక్యూఏసీ సమన్వయ కర్త డా. మధు సుధన్ పరీక్షల నియంత్రణ అధికారి డా గోపాల సుదర్శన్ ఉన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

**కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు. గురువారం విద్యాధికారులతో సమీక్షించారు. ఈ విద్యా సంవత్సరం మెరుగైన విద్యా ప్రమాణాల లక్ష్యంగా ముందుకు పోతూ బడి బాట సమర్ధవంతంగా నిర్వహించాలని, విద్యార్థుల తక్కువ నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల నమోదు పెంచుటకై గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని, కనీస సామర్థ్యాలు అయినటువంటి చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో ఏర్పాటు చేసే మౌలిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించాలని, వీటి ఆధారంగానే పాఠశాలలకు ప్రగతి సూచికలు ఇవ్వబడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అలాగే ఎఫ్ఆర్ఎస్, ఇతర అంశాలపై దృష్టి పెట్టి సరియగు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని భవిత కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని, కొత్త ప్రీ ప్రైమరీ విభాగాలను ప్రారంభించాలని, విద్యార్థుల సంఖ్యలేని పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాలని, స్వయం సహాయక బృందాల చేత పిల్లలకు యూనిఫామ్ కుట్టించాలని, నూతన టెక్నాలజీ ఏఐ, డిజిటల్ తరగతులను నిర్వహించాలని, విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక కార్యచరణ ప్రకారం ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి రాజు, చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజు, ఏఎంఓ సుదర్శన మూర్తి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# సభల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రత్యేక గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని శంకరంపేట (ఆర్) మండలంలోని రుద్రారంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్, హార్టికల్చర్ అధికారి ప్రతాప్ సింగ్ పశు వైద్యాధికారి వెంకటయ్య, ఇతర జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ..రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మురికి కాలువలను శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, తాగునీటి వనరులు, వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, స్వచ్ఛత పోస్టర్లను ఆవిష్కరించారు. సర్పంచ్ సంతోష నవీన్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



**మెదక్ పట్టణంలో....**

ప్రభుత్వ సూచనల మేరకు మెదక్ మున్సిపాలిటీలో వార్డు సభలు చైర్‌పర్సన్ కానుగు రాధిక ప్రారంభించారు. 2, 3, 3 వార్డులో జరిగిన సమావేశంలో వైస్ ఛైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కమిషనర్ నవీన్, కౌన్సిలర్లు పోచయ్య, లలిత, స్వరూప, కోఆప్షన్ సభ్యులు కొర్వి రాములు, తహశీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు. వార్డులోని సమస్యలను అధికారులు, ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

## అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన

**ముద్ర ప్రతినిధి, మెదక్:** 99 రోజుల ప్రణాళిక లో భాగంగా మెదక్ లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ – మానవుల బాధ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అటవీ క్షేత్ర అధికారి గణేష్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కుదుబుద్దిన్, పోచారం సెక్షన్ ఆఫీసర్ భీమ్ రెడ్డి, డీబీసీ పోచారం బీట్ అధికారి రాము పర్యవేక్షణ చేశారు.



### ఏపీ రాజ్యసభ స్థానాలపై ఎన్డీయే కూటమి ఏకాభిప్రాయం

ముద్ర, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల కేటాయింపుపై ఎన్డీయే కూటమి నేతలు అవగాహనకు వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మూడు స్థానాలను తెలుగు దేశం పార్టీకి, ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు. అభ్యర్థుల పేర్లను టీడీపీ, జనసేన త్వరలో ప్రకటించనున్నాయి. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తి సందర్భంగా ఈ నెల 9న తిరుపతి, 12న అమరావతి, 15న విశాఖపట్నంలో బహిరంగ సభలు నిర్వహించనున్నారు.

# రేవంత్ బావమరిది ₹15 కోట్ల స్కామ్

- డైవర్ట్ చేసేందుకే బాల్క సుమన్ అరెస్ట్
- చంచల్ గూడ జైలులో బాల్క సుమన్ తో కేటీఆర్ ములాఖత్
- సింగరేణిలో స్కామ్ జరుగుతున్నా కేంద్రం ఏం చేస్తున్నదని నిలదీత



**ముద్ర, హైదరాబాద్:** సింగరేణిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సూత్రధారిగా సాగిన రూ. 15,000 కోట్ల భారీ కుంభకోణాన్ని కప్పిపుచ్చేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అక్రమంగా అరెస్ట్ చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ అణచివేత చర్యలకు తాము భయపడబోమని, తమకు జైళ్లు, పోలీస్ కేసులు, పోరాటాలు కొత్తేమీ కాదని ఆయన స్పష్టం చేశారు. సింగరేణిలో జరుగుతున్న దోపిడీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, సంస్థను మరియు కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని తేల్చిచెప్పారు. సింగరేణి కార్మికుల తరఫున నిలబడుతూ, అక్కడ జరుగుతున్న అక్రమాలను నిరంతరం నిలదీస్తూ, నిజాలను ప్రజల ముందు ఉంచుతామని కేటీఆర్ హెచ్చరించారు.

# మేఘం కురిసెను.. తెలంగాణ, ఏపీలో తొలకరి జల్లులు

**ముద్ర డెస్క్ :** నైరుతి రుతుపవనాలు కేరళను తాకడంతో దక్షిణ భారతదేశంలో వర్షాల సందడి మొదలైంది. వేసవి ఎండలతో అల్లాడిన ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో గత రాత్రి నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ప్రభావం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలపై కూడా కనిపిస్తోంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాల ప్రకారం, గురువారం నుంచి తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వరుసగా మూడు రోజుల పాటు వర్షాలు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోనూ వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. ఉత్తరాంధ్రతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. తీరప్రాంతాల్లో మేఘావృత వాతావరణం కొనసాగుతుండగా, కొన్ని చోట్ల భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది.

ప్రస్తుతం అరేబియా సముద్రం, లక్షద్వీప్ ప్రాంతాలు, బంగాళాఖాతం మీదుగా నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయని వాతావరణ అధికారులు పేర్కొన్నారు. రుతుపవనాల వేగం, తీవ్రత పెరగడంతో తెలంగాణపై భారీ మేఘాలు కమ్ముకుంటున్నాయి. దీంతో పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగిస్తున్న ఈ తొలి వర్షాలు రైతుల్లోనూ ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో రైతులు సాగు పనుల కోసం సిద్ధమవుతున్నారు. మొత్తంగా నైరుతి రుతుపవనాల రాకతో తెలుగు రాష్ట్రాల్లో వర్షకాలం ఆరంభమైన సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413 . email: mudradaily@gmail.com